# బందీ

సీతారామయ్య ఇంట్లో వెండి పళ్లెం పోయింది. ఇంటిల్లి పాదీ కంగారుగా తిరుగుతున్నారు. పోలీసు రిపోర్టు ఇవ్వాలను కుంటున్నారు. అనుమానం ఉన్న వాళ్ల పేర్లన్నీ చెప్తున్నారు. జ్ఞాపకం వచ్చిన వాణ్నల్లా అనుమానిస్తున్నారు.

'నాన్నా! నేను రిపోర్టు ఇచ్చి వస్తానే' అన్నాడు కొడుకు శేఖరం.

'నీ కివ్వాలనుంటే ఇచ్చిరా' అన్నాడు సీతారామయ్య సొమ్ము పోయిందన్న ధ్యాసే లేకుండా. నిశ్చలంగా ఉన్న తండ్రిని చూసి, శేఖరం ఆశ్చర్య పోయాడు.

'అదేమిటండీ. వందరూపాయల కంచంపోతే అట్లా అంటారూ' అంది సీతారామయ్య భార్య శాంతమ్మ.

'ఆ పళ్లెం మనది కాదే' అన్నాడు తాపీగా సీతారామయ్య.

సీతారామయ్యలో దొంగ దోచుకుపోతున్నా చూస్తూ ఉండటమనే తత్వం బయలుదేరి దాదాపు ఆరేళ్ళయింది. ప్రపంచంలో 'నా' అన్న వస్తువేదీ లేకుండా చేసికోవాలని ఆయన అప్పట్నించీ ప్రయత్నంచేస్తూ ఇప్పటికి ఒక స్థితి చేరుకున్నాడు. ఆరేళ్ళ క్రితం సీతారామయ్య భగవంతుణ్ని గురించి ఆలోచించటం మొదలెట్టాడు.

దేవుడు దివ్యమంగళ మూర్తిగా తోచాడు. ఆ స్వామిది భువనమోహనమైన రూపం, మహాసౌందర్యాల మధుర

సమ్మేళనం. ఆ రసధునిని సాకల్యంగా సందర్శించాలని పడే వేదన మధుకీల. ఆ జ్వాలలో వేగిపోవటం మొదలెట్టాడు సీతారామయ్య.

సీతారామయ్యకు ఈ ప్రపంచంలోని ప్రతి సౌందర్యం లోనూ ప్రతి 'మంచి' లోనూ భగవంతుడి ఛాయ తోచేది. ప్రతి మనిషి చాలా అందంగా కన్పించే వాడు. సర్వుల్ని ఆప్యాయంగా సమానంగా ప్రేమించటం మొదలెట్టాడు. 'నా భార్య,' 'నా కొడుకు' అన్న భావం సీతారామయ్యని కొంత కాలం బాధించింది. తన వాళ్ళ యందున్న ఈ పాక్షికమైన దృష్టి భగవత్సౌందర్యాన్ని ఆవిష్కరించుకోటానికి ఆటంకంలా కన్పించింది. ఈ అడ్డు తొలగించుకోటానికి సాధన చేశాడు.

ఒకసారి శాంతమ్మకు జబ్బుచేసింది. కొంచెం తీవ్రమైన జబ్బే. శేఖరం మందులవీ తీసికొచ్చేవాడు. అప్పుడప్పుడు సీతారామయ్య భార్య మంచం పక్కన కూర్చుని పలకరించే వాడు. భార్య నీరసంగా సీతారామయ్య వైపు చూసేది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేవి.

'ఎందుకు కన్నీళ్ళు? ఇంతకాలం సుఖం అనుభవించావు. ఇప్పుడు బాధవస్తే కష్టపడ్తే ఎట్లా? ఆ బాధగూడా అంత తేలిగ్గా అనుభవించేయాలి' అనేవాడు సీతారామయ్య.

సీతారామయ్యకు తన ఇల్లు చిన్న సత్రంలా కన్పిస్తోంది. భార్య, కొడుకు, కోడలు అంతా దారినపోతూ, కొంచెంసేపు విశ్రాంతి తీసుకోడానికి వచ్చిన మనుష్యుల్లా ఉన్నారు. కొందరు ముందు వచ్చారు. కొందరు తర్వాత వచ్చారు. అట్లాగే కొందరు ముందు కొందరు తర్వాత వెళ్తారు. ఈ సత్రంలో కలిగిన తాత్కాలిక పరిచయాలు

ముందు చేయవలసిన ప్రయాణానికి, చేరవలసిన గమ్యానికి ఆటంకాలు కాకూడ దనుకున్నాడు సీతారామయ్య.

'అబ్బ! ఎంత బావుంది! నా మార్గం ఎంత సుగమ మైంది! నా కీనాటికి విముక్తి కలిగించావా భగవాన్' అను కున్నాడు సీతారామయ్య.

* * *

శేఖరం భార్య మొగపిల్లవాణ్ణి కన్నది. శాంతమ్మ సీతారామయ్య గదిలోకి పరుగెత్తుకొచ్చి చెప్పింది 'మీకు మనవడు పుట్టాడండీ.'

'సత్రంలోకి కొత్త మనిషొచ్చాడా? ఏ వూరుట?' అన్నాడు సీతారామయ్య.

శాంతమ్మ తెల్లబోయింది. భర్త అంటున్నదేమిటో అర్థం కాలేదు.

'కోడలికి కొడుకండీ. మీకు మనవడు పుట్టాడు' అంది.

'ఆహా?—అట్లాగా!' సంతోషం నటిస్తూ అన్నాడు సీతారామయ్య.

మనవడు కల్గాడన్న వార్త సీతారామయ్యకు పెద్ద ఆనందాన్ని కలిగించలేదు. ఆ వార్త చెబుతున్నప్పుడు శాంత మ్మకు కళ్ళల్లో కదిలే వెలుగు అతన్ని ఆశ్చర్యపరచింది.

'రండి. మనవణ్ణి చూద్దురుగాని' అంది శాంతమ్మ.

'పద' అన్నాడు సీతారామయ్య భార్య సంబరపు పొంగుకు నవ్వుకుంటూ.

కళ్ళు తెరవని మనవణ్ణి పొత్తిళ్ళలో చూపించింది శాంతమ్మ. ఆ పసిపాప మిసిమి చూసి సీతారామయ్య మనస్సు

చెదిరిపోయింది. పాప 'కేరు' మన్నాడు. సీతారామయ్యకు దేవదూత పిలిచినట్లుంది. స్వర్గ ద్వారాలు తెరిచే తాళపు చెవులు తన నునులేత వేళ్ళ గుప్పిట్లో బిగించి భద్రంగా తీసికొచ్చి అందిస్తున్నట్లుగా, పాప తన గుప్పిటను సీతారామయ్య వైపు సాచాడు. సీతారామయ్య చలించిపోయాడు. కళ్ళు చెమ్మగిల్లినై. భార్య చేతుల్లోంచి పాపను తన చేతుల్లోకి తీసుకున్నాడు. పాప పాలబుగ్గలు ముద్దు పెట్టుకున్నాడు. పాప 'కేరు' మన్నాడు. ఆ స్వరంలో తను తరించే మంత్ర మేదో మోగినట్లనిపించింది. మళ్ళీ ముద్దు పెట్టుకోబోతుంటే శాంతమ్మ ఆపి 'పాలకోసం ఏడుస్తున్నాడు' అని పాపని తన చేతుల్లోకి తీసికుంది. శాంతమ్మ ముఖంలో వెలుగు నృత్యం చేస్తోంది. పక్కనే కొడుకు, కోడలు చూట్టానికి వచ్చిన కొందరు ఆడ వాళ్ళు ఉన్నారు. సీతారామయ్య వీళ్ళ నింతవరకు గమనించనే లేదు. చూడవచ్చిన వారు 'అచ్చు తాత పోలికే' అంటున్నారు. సీతారామయ్య ధీమాగా అంగ లేసుకుంటూ గది బయటికి వచ్చేశాడు.

సీతారామయ్యకు పాత అనుభూతులు పునరావృత్తం అవుతున్నాయి. బాబు నవ్విన బోసినవ్వులు, వేసిన తప్పటడుగులు, వచ్చీరాని పిలుపులు సీతారామయ్యలో చెరగని ముద్రలు వేస్తున్నాయి. ఎప్పుడూ మనవణ్ణి గురించే ఆలోచించే వాడు. శేఖరం పుట్టినప్పుడు కూడా తనింత ఆనందాతిరేకాన్ని అనుభవించలేదు. అప్పట్లో సంసారభారం తెరిపినిచ్చేదికాదు.

బాబుకి మూడేళ్ళు నిండుతున్నాయి. సీతారామయ్య పారాయణ చేసుకొంటుంటే బాబు పక్కనించి పోతూ 'ఫెడీ'

మని ఆ పుస్తకాన్ని కింద పడగొట్టి వెళ్ళేవాడు. సీతారామయ్య పరుగెత్తుతున్న బాబుని చూస్తూ, నవ్వుకుంటూ కిందపడ్డ పారాయణ పుస్తకాన్ని తీసికొనేవాడు. బాబుమీద ఈగ వాలనిచ్చేవాడు కాదు సీతారామయ్య. బాబు ఒక రోజు గాజుగ్లాసు పగలగొట్టాడని వాళ్ళమ్మ రెండు చరిచింది. ఆ రోజు సీతారామయ్య అన్నం మానేశాడు.

బాబు వాకిట్లోనుంచి పెద్దగా ఏడుస్తూ వచ్చాడు.

'తాతయ్యా! వాళ్ళ బాచిగాడు నన్ను సైకిలు ఎక్కనీటంలా. నాక్కూడా అట్లాంటి మూడుకాళ్ళ సైకిలు కొనిపెట్టవా...' అంటూ సీతారామయ్య ఒళ్ళో దూకాడు.

'కొనిపెడ్తాలే...ఏడవకు' అన్నాడు సీతారామయ్య.

'ఇప్పుడే...ఇప్పుడే కావాలి ఈ...' అన్నాడు బాబు గునుస్తూ.

'ఆ...ఆ! ఇప్పుడే కొనుక్కొస్తా! ఏడవకు మరి... మా నాన్నగదూ' అని 'ఏమేవ్' అని భార్యని కేకేసి 'నీదగ్గిర డబ్బేమైనా ఉందా?' అని అడిగాడు సీతారామయ్య.

శాంతమ్మ ఆశ్చర్యపోయింది. సీతారామయ్య గత ఏడెనిమిదేళ్ళలో ఇదే డబ్బుప్రసక్తి తేవటం.

'ఎంత?'

'ఎంతుంది?'

'ముప్పై.'

'పట్టా'

ఆ డబ్బు తీసికొని, చొక్కా తగిలించుకొని ఉత్తరీయం వేసుకోకుండా వీధిలో పడ్డాడు.

'ఇదిగో! షావుకారూ! ఈ మూడు చక్రాల సైకి

లిచ్చెయ్యవయ్యా'.

'అది అమ్ముడు పోయిందండి. మా దగ్గిర ఒకటే ఉంది. నిన్న రంగయ్యగారు వాళ్ళ మనవడికి తీసికొంటానని చెప్పి వెళ్ళారు. ఇంకో పదిరోజుల్లో స్టాకు వస్తుంది. అప్పుడురండి.'

'అదేం కుదర్దు. కావాలంటే ఇంకో రెండు రూపాయలు ఎక్కు- విస్తాను తీసుకో...రంగయ్యగారికి చెప్పవయ్యా ఇంకో పదిరోజుల్లో స్టాకు వస్తుంది; అప్పుడు తీసుకోమని.'

సైకిలు పట్టించుకొస్తూ సీతారామయ్య ఆలోచిస్తు న్నాడు. 'ఏమిటి చిత్రం! తనెంతమారిపోయాడు! మనవడంటే ఎందు కింత ప్రత్యేకమైన ఆపేక్ష! నాకు తెలియని సంకెళ్ళు ఇంకా ఎన్ని బిగించావు తండ్రీ?' అనుకున్నాడు ఆకాశం వైపు చూస్తూ.